

నేటి నుంచి రిజిస్టర్ పోస్టుకు సెలవు

సాలూరు రూరల్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): రిజిస్టర్ పోస్టుకు తపాలా సంస్థ నేటి నుంచి రాం రాం చెబుతుంది. దీనిని సోమవారం స్పీడ్‌పోస్టులో విలీనం చేయనుంది. దీనివల్ల రిజిస్టర్‌పోస్టుకు ఉండే భద్రత, పరిహారం, రియల్ టైం ట్రాకింగ్ వంటివి మరింత సౌలభ్యంగా లభిస్తాయని పోస్టల్ శాఖ వర్గాలంటున్నాయి. అయితే స్పీడ్ పోస్టు వల్ల వినియోగదారులపై చార్జీల భారం పడనుంది. కాగా పోస్టల్ బాక్స్ (ఎర్రడబ్బాలు) నిర్వహణ ఎప్పటిలానే ఉంటుందని తపాలాశాఖ ఏపీ డైరెక్టర్ సంతోష్ (విజయవాడ) ఆదివారం స్పష్టం చేశారు.

నిమజ్జనోత్సవాల సందడి

- ఘనంగా గణనాథుడి అనుపోత్సవం
- ఆనందోత్సాహాల నడుమ వేడుకలు


బత్తిలిలో..

గరుగుబిల్లి/భామిని, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పలుచోట్ల ఆదివారం వినాయక నిమజ్జనోత్సవాల సందడి నెలకొంది. ఆనందోత్సాహాల నడుమ వేడుకలు నిర్వహించారు. మేళతాళాలు, డీజేలు, యువత కేరింతల మధ్య వినాయకుడి విగ్రహాలతో ఊరేగింపు నిర్వహించి అనుపోత్సవం నిర్వహించారు. చిన్నా పెద్దా అని తేడా లేకుండా అందరూ ఈ వేడుకల్లో పాల్గొన్నారు. గరుగుబిల్లి, భామిని మండలాల్లో వినాయక మండపాల్లో ప్రత్యేక పూజలు చేశారు. లడ్డూ ప్రసాదాలకు వేలం పాట నిర్వహించారు. ఉల్లిభద్ర, దత్తివలస, కొత్తూరుతో బత్తిలి తదితర గ్రామాల్లో పలువురు భక్తులు రూ.10 వేల నుంచి రూ. 30 వేల వరకు వేలం పాట నిర్వహించి లడ్డూను కైవసం చేసుకున్నారు. అంతకుముందు మహిళలు సామూహిక కుంకుమార్చనలు చేశారు. అనంతరం వంశధార, నగావళి నదులు, సమీప చెరువుల్లో నిమజ్జనోత్సవాలు నిర్వహించారు. వాస్తవంగా తొమ్మిదో రోజున అధికంగా నిమజ్జనం చేస్తారు. కానీ సెప్టెంబరు 7న చంద్రగ్రహణం ఉన్న నేపథ్యంలో చాలా చోట్ల ముందస్తుగా నిమజ్జనాలు చేపడుతున్నారు.


ఉల్లిభద్రలో ఊరేగింపుగా నిమజ్జనోత్సవానికి వెళ్తున్న యువత

వంతెనల వెతలు తీరేనా?

- ప్రమాదకర స్థితిలో 17
- మరమ్మతులు చేపట్టాల్సినవి 113
- ప్రభుత్వానికి ప్రతిపాదనలు
- నిధులు మంజూరైతేనే మోక్షం
- అప్పటి వరకు మన్యం వాసులకు తప్పని కష్టాలు

పార్వతీపురం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో దశాబ్దాల కిందట నిర్మించిన వంతెనలు పూర్తి శిథిలావస్థకు చేరుకున్నాయి. ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్నాయి. అవి ఏ క్షణాన కూలుతాయో తెలియని పరిస్థితి. కొన్ని ప్రమాదకరంగా మారడంతో వాహనదారులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. అవి ఏ మాత్రం కూలినా.. రాకపోకలు పూర్తిగా స్తంభించనున్నాయి. కొన్నిచోట్ల ప్రత్యామ్నాయ మార్గం కూడా లేదు. ఈ నేపథ్యంలో వాటిపై దృష్టి సారించి.. త్వరితగతిన పనులు చేపట్టాల్సి ఉందని జిల్లావాసులు కోరుతున్నారు. కాగా ఇప్పటికే ఆర్‌అండ్‌బీశాఖ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించింది. నిధులు మంజూరైతే వంతెనలకు మోక్షం కలగనుంది. జిల్లాలో మొత్తంగా 869 వంతెనలు ఉన్నాయి. ఇందులో 17 ప్రమాదకర స్థితిలో ఉండగా.. మరో 133 వంతెనలకు మరమ్మతులు చేపట్టాల్సి ఉంది. 27 వంతెనలను పునర్నిర్మాంచాల్సి ఉంది. రీ కనస్ట్రక్షన్‌తో పాటు శిథిలావస్థలో ఉన్న 17 వంతెనల నిర్మాణానికి (మిగతా 6వ పేజీలో..)


దుగ్గేరు ప్రాంతంలో ఓ వంతెన పరిస్థితి ఇదీ...


సంకిలి వంతెన ఇలా..


శిథిలావస్థలో కోటిపాం బ్రిడ్జి

సీతాఫలం.. ధర పతనం

- ఆందోళనలో గిరిజన రైతులు

సీతంపేట రూరల్, ఆగస్టు31(ఆంధ్రజ్యోతి): సీతంపేట మన్యంలో ఈ సీజన్‌లో లభించే సీతాఫలాలకు ఏటాలానే ఈ సారి కూడా డిమాండ్ అధికంగానే ఉంది. సీతంపేట వారపు సంతలో ఆదివారం గిరిజనులు తీసుకొచ్చే పండ్లను కొనేందుకు మైదాన ప్రాంత వ్యాపారులు ఎగబడ్డారు. అయితే వారిలో కొందరు సిండికేట్‌గా మారి ఒక్కో ట్రే ధరను రూ.600 నుంచి రూ.700 వరకు మాత్రమే పరిమితం చేశారు. గత వారం ఒక్కో ట్రే ధర రూ.1000వరకు పలికింది. కానీ ఈ వారం సంతకు పంట ఎక్కువగా రావడంతో వ్యాపారులు వాటి ధరను తగ్గిం చారు. దీంతో దీంతో చేసేది లేక గిరిజన రైతులు వారు నిర్ణయిం చిన ధరకే సీతాఫలాలను విక్రయించారు. ఇక్కడ కారుచౌకగా కొనుగోలు చేసిన వ్యాపారులు మైదాన ప్రాంతాల్లో ఒక్కో పండును రూ.15కు విక్రయిస్తున్నారు. దీనిపై అధికారులు దృష్టి సారించాలని గిరిజన రైతులు కోరుతున్నారు.


వారపు సంతకు గిరిజనులు తీసుకువచ్చిన సీతాఫలాలు

రైతులకు నష్టం.. దళారులకు లాభం

- ఇదీ రామభద్రపురం కూరగాయల మార్కెట్‌లో పరిస్థితి

రామభద్రపురం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్రలోనే కాయగూరల విక్రయాల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకున్న రామభద్రపురం మార్కెట్ పరిస్థితి నానాటికీ దయనీయంగా మారుతోంది. మార్కెట్ నుంచి వేలంపాట ద్వారా లక్షల రూపాయలు వస్తున్నప్పటికీ సౌకర్యాలు అంతంతమాత్రంగా ఉన్నాయి. రైతులు ఎంతో శ్రమపడి ఎండనకా, వాననకా కష్టపడుతూ కూరగాయలు తెస్తే గిట్టుబాటు ధర అంతంత మాత్రంగా దక్కుతోంది. దళారులకు మాత్రం ఈ మార్కెట్ కాసులు కురిపిస్తోంది. విజయవాడ, గుంటూరు, విశాఖపట్నం, జైపూర్ ప్రాంతాలకు కూరగాయలను తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. రామభద్రపురం మండలంలో శాశ్వత సాగునీటి వనరులు లేవు. అయినప్పటికీ సుమారు 500 ఎకరాల్లో రైతులు వర్షాధారంపై కూరగాయలు పంటలు సాగుచేసుకొని జీవనం సాగిస్తున్నారు. వాటిని రామభద్రపురం మార్కెట్‌కు తీసుకురావడం ఆనవాయితీ. అయితే వీరికి సరైన మార్కెటింగ్ సౌకర్యం కల్పించడం లేదు. కూరగాయలు నిల్వ చేసుకునేందుకు గిడ్డంగి సౌకర్యం కల్పిస్తామని దశాబ్దాల నుంచి అధికారులు చెబుతున్నా ఆచరణ లేదు. మార్కెట్‌లో దళారీలదే రాజ్యం. ఒక్కోరోజు సిండికేట్ అయి రైతులు తెచ్చిన కూరగాయలకు సరైన ధర లేకుండా చేస్తున్నారు. విత్తనాలు, పురుగు మందుల ధరలు ఏటా విపరీతంగా పెరిగిపోవడంతో అతికష్టం మీద కూరగాయలు సాగు చేస్తున్న రైతులు ఆపై మార్కెట్‌కు వెళ్లాక శ్రమదోపిడీకి గురవుతున్నారు. ఒక్కో సమయంలో కూరగాయల రేట్లు భారీగా పడిపోవడం, గిటుబాటు ధర లేకపోవడంతో రోడ్లపై పారబోసిన ఘటనలు ఉన్నాయి. ఇప్పటికైనా జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.


రామభద్రపురం కూరగాయల మార్కెట్

సైక్లింగ్‌తో ఆరోగ్యం మెరుగు: ఎస్పీ

బెలగాం, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): సైక్లింగ్‌తో ఆరోగ్యం మెరుగుపడుతుందని ఎస్పీ ఎస్వీ మాధవరెడ్డి తెలిపారు. పర్యావరణ పరిరక్షణకు కూడా సైకిల్ వినియోగం ఎంతగానో దోహదపడుతుందన్నారు. ఆదివారం పార్వతీపురంలో 'సైకిల్ ఆన్ సండే' నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి బైపాస్ రోడ్డు మీదుగా సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో ఎస్పీ సైకిల్ తొక్కి అందర్నీ ఉత్సాహపరిచారు. సైక్లింగ్ తో శారీరకంగా ఫిట్‌గా ఉండొచ్చని ఆయన తెలిపారు. 'ఫిట్ ఇండియా'లో అందరూ భాగస్వాములవ్వాలని పిలుపునిచ్చారు.


సైకిల్ ర్యాలీలో పాల్గొన్న ఎస్పీ మాధవరెడ్డి

ఆరోగ్యమే
మహాభాగ్యం
- పౌష్టికాహారంతో రోగాలు దూరం
- నేటి నుంచి జాతీయ పౌష్టికాహార వారోత్సవాలు

5లో



బిల్లులు రాక.. ఇళ్లు కట్టలేక!

- ఇది మక్కువ మండలంలో పరిస్థితి
- గత టీడీపీ ప్రభుత్వ హయాంలో మంజూరైన వాటిపై నిర్లక్ష్యం
- నిధులు మంజూరు చేయని వైసీపీ సర్కారు
- కూటమి ప్రభుత్వంపైనే ఆశలు

మక్కువ రూరల్, ఆగస్టు31(ఆంధ్రజ్యోతి): మక్కువ మండ లంలో గృహ నిర్మాణదారుల పరిస్థితి దయనీయంగా మారింది. అప్పులు తీర్చలేక.. ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయలేక నానా అవస్థలు పడుతున్నారు. బిల్లులు మంజూరులో గత వైసీపీ సర్కారు నిర్లక్ష్యంగా వ్యవహరించడమే ఇందుకు కారణం. ప్రస్తుతం వారంతా కూటమి ప్రభుత్వంపైనే ఆశలు పెట్టు కున్నారు. వాస్తవంగా గత టీడీపీ ప్రభుత్వ హయాంలో మండలానికి సుమారు 1600 గృహాలు మంజూరుచేశారు. ఎన్టీఆర్ గృహ నిర్మాణ పథకం కింద రూ.2 లక్షలు, పీఎం ఆవాస్ యోజన కింద రూ.2.50 లక్షలు కేటాయిం చారు. అయితే 1052 ఇళ్ల నిర్మాణం పూర్తికాగా.. వివిధ నిర్మాణ దశల్లో మిగిలిన గృహాలకు బిల్లులు చెల్లించేందుకు ఆ శాఖాధికారులు ప్రభుత్వానికి నివేదికలు పంపారు. అయితే ఈలోపుగా ఎన్నికలు జరగడం.. వైసీపీ అధికారంలోకి రావడంతో సీన్ మారింది. 548 మందికి సంబంధించిన బిల్లులు గత వైసీపీ సర్కారు చెల్లించలేదు. 2023లో సార్వత్రిక ఎన్నికల ముందు పెండింగు బిల్లులు చెల్లిస్తామంటూ రెండు దఫాలు సర్వేకూడా చేయిం చింది. కానీ లబ్ధిదారులకు మాత్రం బిల్లులు మాత్రం చెల్లించ లేదు. దీంతో నేటికీ ఆ ఇళ్ల నిర్మాణం పూర్తి కాలేదు. పిచ్చి మొక్కల మధ్య దర్శనమిస్తుండడంతో లబ్ధిదారులు లబోదిబో మంటున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పెండింగ్ బిల్లులు చెల్లిస్తామని ప్రకటించింది. ఈ మేరకు అధికారులు మరోసారి సర్వే చేపట్టి వివరాలు సేకరించారు. అయితే ఏడాది గడుస్తున్నా పాత బిల్లులకు మోక్షం కలగలేదు. మండలంలోని 21 పంచాయతీల (మిగతా 6వ పేజీలో...)


ఎర్రసామంతవలసలో ఓ గృహం ఇలా..

ప్రతి సమస్యా
పరిష్కరిస్తాం
- మంత్రి సంధ్యారాణి

రైతులకు
సహకరించాలి
- ప్రభుత్వ విప్ జగదీశ్వరి

6లో

మక్కువలో కుక్కల
స్వైరవిహారం
- భయాందోళనలో గ్రామస్థులు

6లో

యూరియా.. ఏదయా?

- ఇంకా 3 వేల మెట్రిక్ టన్నులు అవసరం
- అదే దారిలో మిగిలిన ఎరువులు కూడా..
- అరకొరగా వచ్చే వాటి కోసం రైతుల బారులు



జియ్యమ్మవలస, ఆగస్టు31(ఆంధ్రజ్యోతి): జిల్లా రైతులను ఎరువుల కొరత తీవ్రంగా వేధిస్తోంది. ఈ ఏడాది ఖరీఫ్‌కు సంబంధించి ఉబాలు ఆలస్యంగా ప్రారంభమవడం, అనుకున్న సమయానికి నీరు లేకపోవడం తో రైతులు కొంత ఆందోళన చెందారు. అయితే తరువాత వర్షాలు కుర వడంతో కొంత ఊపిరిపీల్చుకున్నారు. కానీ వారికి పూర్తిస్థాయిలో ఎరువులు లభించకపోవడంతో తీవ్ర ఆందోళన చెందుతున్నారు. జిల్లా పరిధిలో రైతులు ఈ ఖరీఫ్ సీజన్‌లో మొత్తం 73,139 హెక్టార్లలో వివిధ పంటలను సాగు చేస్తున్నారు. ఇందులో వరి 59,168 హెక్టార్లు, మొక్క జొన్న 5,531 హెక్టార్లు, పత్తి 5,581 హెక్టార్లు, చెరకు 818 హెక్టార్లు, రాగులు 1,032 హెక్టార్లలో పండిస్తు న్నారు. జనుము, కందులు, సజ్జలు, మినుములు, కొర్రలు, సామలు కలిపి 709 హెక్టార్లలో సాగు చేస్తున్నారు.


వీరఘట్టంలో యూరియా కోసం క్యూ కట్టిన రైతులు (ఫైల్)

ఇదీ పరిస్థితి..

- జిల్లాకు 17 వేల మెట్రిక్ టన్నుల యూరియా కావాలని వ్యవసా యాధికారులు ప్రభుత్వానికి నివేదించారు. అయితే ఇప్పటివరకు 14 వేల మెట్రిక్ టన్నుల యూరియాను గ్రామ వ్యవసాయ అసిస్టెంట్ల ద్వారా రైతులకు పంపిణీ చేశారు. ఇంకా 3 వేల టన్నుల యూరియా అవసరం. ప్రస్తుతం ఇది అందక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా ఏజెన్సీ మండలాల్లో వారు నానా అవస్థలు పడుతున్నారు.
- పీఏసీఎస్‌లకు వచ్చే అరకొర యూరియా కోసం రైతులు (మిగతా 6వ పేజీలో...)

ఆకతాయిల ఆట కట్టించేందుకే శక్తి టీమ్స్

విజయనగరం క్రైం, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఆకతాయిల ఆటలు కట్టించేందుకే శక్తి టీమ్స్‌ని రంగంలో దించామని ఎస్పీ వకుల్ జిందాల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆరుగురు సభ్యులతో ఐదు బృందాలుగా 30 మందితో శక్తి టీమ్స్‌ని ఏర్పాటు చేశామన్నారు. ఒక్కొక్క బృందానికి ఎస్ఐ నాయకత్వం వహిస్తున్నారన్నారు. ఈ టీమ్స్‌ని పర్యవేక్షణాధికారిగా ఏఎస్పీ సౌమ్య లతను నియమించామని తెలిపారు. జిల్లాలో విజయనగరం, బొబ్బిలి, రాజాం పట్టణాల్లో ఆరుగురు పోలీసు సిబ్బందితో ఐదు బృందాలుగా ఈ టీంను ఏర్పాటు చేశామన్నారు. కళాశాలలు, పాఠశాలల్లో సెల్ఫ్ డిఫెన్స్ టెక్నిక్స్‌ని కూడా నేర్పిస్తున్నావని చెప్పారు.

హెచ్ఎంల సంఘం ఏజీఎస్‌గా శ్రీనివాసరావు

విజయనగరం కలెక్టరేట్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ప్రధానోపాధ్యాయుల సంఘం రాష్ట్ర అడిషనల్ జనరల్ సెక్రటరీగా జిల్లాకు చెందిన పీఏజీహెచ్ శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. ఆదివారం విజయవాడ లయోలా కాలేజీలో జరిగిన కార్యవర్గ ఎన్నికలో ఆయనను ఎన్నుకున్నారు. జిల్లా సంఘం అధ్యక్షుడు వేణుగో పాల్, కార్యదర్శి సన్యాసిరాజు అభినందించారు.

అశోక్‌కు ఘన స్వాగతం

నెల్లిమర్ల, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): గోవా గవర్నర్‌గా బాధ్యతలు స్వీకరించిన తర్వాత తొలిసారిగా విజయనగరం స్వగృహానికి వచ్చిన పూసపాటి అశోక్‌గజపతిరాజుకు టీడీపీ నాయకులు ఘన స్వాగతం పలికారు. ఏపీ మార్క్‌ఫెడ్ ఛైర్మన్ బంగ్రారాజు, విశాఖపట్టణం ఉత్తర నియోజకవర్గం పరిశీలకుడు సువ్వాడ రవిశేఖర్, పార్టీ నెల్లిమర్ల మండల అధ్యక్షుడు కడగల ఆనంద్‌కుమార్, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి గేదెల రాజారావు, జిల్లా కార్యదర్శి లెంక అప్పలనాయుడు, తదితరులు స్వాగతం పలికిన వారిలో ఉన్నారు.

గ్రంథాలయ అధికారిని నియమించరూ..

భోగాపురం, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): భోగాపురం గ్రామంలోని గ్రంథాలయానికి గత ఐదేళ్లగా గ్రంథాలయ అధికారి లేరు. దీంతో స్వీపరే నిర్వహించాల్సి వస్తోంది. ఈ గ్రంథాలయానికి డెంకాడ గ్రంథాలయ అధికారి వై.మహేష్ ఇన్‌చార్జి బాధ్యతలు వహిస్తున్నారు. అయితే ఆయన ఈ గ్రంథాలయానికి సరిగా రాలేకపోవడంతో ఇక్కడ ఉన్న స్వీపరే తన పనులతో పాటు నిర్వహణ కొనసాగిస్తున్నారు. గ్రంథాలయ అధికారిని నియమించాలని పాఠకులు కోరుతున్నారు.

ఆకట్టుకున్న సంగీత కార్యక్రమాలు



సంగీత కచేరీ నిర్వహిస్తున్న దృశ్యం

విజయనగరం బాబామెట్ట, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): స్థానిక మహారాజా ప్రభుత్వ సంగీత నృత్య కళాశాలలో ఆదివారం నిర్వహించిన సంగీత నృత్య కార్యక్రమాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. వయోలిన్‌పై ఎస్.పార్థవ పలు గీతాలను వినిపించగా, మృదంగంపై సురేష్‌కుమార్ వాయిద్య సహ కారం అందించారు. అనంతరం డి.హిమబిందు నేహ థామస్, భువనేశ్వరీ బృందం పలు భరతనాట్య కార్యక్రమాలు నిర్వహించి ప్రేక్షకులను ఉత్తేజ పరిచారు. కళాశాల ప్రిన్సిపాల్ మండపాక నాగలక్ష్మి, సునీల్, గణేష్, సిబ్బంది, విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రేగుబిల్లిలో వైద్య శిబిరం

విజయనగరం, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పుట్టినరోజు వారోత్సవాల్లో భాగంగా ఆదివారం రేగుబిల్లి గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని జనసేన నాయకుడు మిడతాన రవికుమార్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్ కళాశాల వైద్యుడు లెనిన్ అజయ్, గంట్యాడ మండల నాయకులు రామునాయుడు, కాశీ, బాలు, అప్పారావు, మధు, శ్రీను, దుర్గా పాల్గొన్నారు.

పవన్‌కు కృతజ్ఞతలు



మాట్లాడుతున్న భీశెట్టి బాబ్జీ

విజయనగరం దాసన్నపేట, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ విశాఖపట్టణంలో జరిగే మహాసభలో మహాకవి గురజాడ అప్పారావు గృహాన్ని ఆధునికీకరించడానికి ప్రభుత్వం తరపున తన వంతు కృషి చేస్తానని ప్రకటించడంపై జిల్లా పౌర వేదిక నుంచి కృతజ్ఞతలు తెలుపుతున్నామని అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ అన్నారు. ఆదివారం గురజాడ స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 11న ఒక తాగుబోతు గురజాడ ఇంట్లో చొరబడి హల్‌చల్ చేసిన నాటి నుంచి గురజాడ గృహాన్ని ఆధునికీకరించాలని, గురజాడ సాహిత్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం డిజిటలైజ్ చేయాలని కృషి చేస్తున్నామని చెప్పారు. దీనిపై అనేక కార్యక్రమాలు చేస్తూనే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌కు చేరేలా పోస్టుకార్డు ఉద్యమాన్ని నిర్వహించామని తెలిపారు. దీనిపై ఉప ముఖ్యమంత్రికి స్పందించడం సంతోషం కలిగించిందన్నారు. ఈ సమావేశంలో వేదిక ప్రతినిధులు ప్రభాకరరావు, నాగేశ్వరరావు, గురజాడ ఇందిర, ప్రసాద్ పాల్గొన్నారు.



శాఖాహారంతో ఆరోగ్యం

డా.రవిప్రసాద్, జనరల్ మెడిసిన్, రాజాం

మాంసాహారాన్ని తగ్గించాలి. వీలైతే దూరంగా ఉంటే మరీ మంచిది. శాఖాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండొచ్చు. ఆకుకూరల వినియోగం పెరగాలి. ఇదే సమయంలో రసాయన ఎరువులు వాడని కూరగాయలు, ఆకుకూరలు లభ్యమైతే వాటిని తీసుకుంటే మంచిది.



ఆరోగ్యమే మహాభాగ్యం

- పౌష్టికాహారంతో రోగాలు దూరం
- నేటి నుంచి జాతీయ పౌష్టికాహార వారోత్సవాలు

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి

డాక్టర్ జీవనరాణి, డీఎంహెచ్‌వో

గర్భిణులు ముఖ్యంగా పౌష్టికాహారంపై దృష్టి పెట్టాలి. పౌష్టికాహార లోపం వల్ల మాతాశిశు మరణాలు, బరువు తక్కువ ఉండడం జరుగుతోంది. గర్భిణులు వైద్యుల సూచనలతో బెల్లం, వేరుశెనగ చిక్కీలు, కర్జూరం, తాజా పండ్లు, కాయగూరలు ఆహారంలో చేర్చుకోవాలి. అప్పుడే గర్భిణీతో పాటు శిశువు అభివృద్ధి కూడా సక్రమంగా జరుగుతుంది.

రాజాం రూరల్/ విజయనగరం రింగురోడ్డు, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యమే మహాభాగ్యం అన్నారు పెద్దలు.. ఇదే నానుడిని ఇప్పుడు చాలా మంది అనుసరిస్తున్నారు. సమతుల ఆహారంపై ఆసక్తి పెంచుకుంటున్నారు.. ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు, డ్రైఫ్రూట్స్ తీసుకునేవారి సంఖ్య పెరుగుతోంది. ఆహారంలో కూరగాయలు, ఆకు కూరలకు విశేష ప్రాధాన్యత ఉంది. మనిషికి సమతుల ఆహారం అందించడంలో ఇవి కీలక పాత్ర పోషిస్తున్నాయి. సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలంటే రోజూ సుమారు 75-125 గ్రాముల ఆకుకూరలు, 85 గ్రాముల దుంపలు, 85 గ్రాముల ఇతర కూరల్ని ఆహారంతో కలిపి తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

కూరగాయలతో లాభాలు..

- కూరగాయల్లో మాంసకృత్తులు, ఖనిజాలు, పిండి పదార్థాలు, విటమిన్లు అధికంగా అందుతాయి.

యాంటీ ఆక్సిడెంట్లు అవసరం

శరీర ఆరోగ్యానికి అవసరమైన సి విటమిన్, ఇ విటమిన్, బీటా కెరోటిన్, లైకోపిన్ వంటి కీలకమైన పోషకాలను యాంటీ ఆక్సిడెంట్లు అంటారు. ఇవి తాజా పండ్లు, కూరగాయలలో పుష్కలంగా లభిస్తాయి.

జాగ్రత్తలూ అవసరమే

ప్రస్తుతం ఆహారధాన్యాలు, కూరగాయల పంటల్లో రసాయనాల వాడకం ఎక్కువైంది. దీంతో ఆకుకూరలు, కూరగాయలు వాడుతున్నా పలురోగాలకు గురవుతున్నారు. రసాయనిక ఎరువులు ఎక్కువగా వాడిన కూరగాయల విషయంలో జాగ్రత్తగా ఉండాలని వైద్యులు చెబుతున్నారు.

వ్యాధులు దూరం..

శాఖాహారం పెరగడం వల్ల కొవ్వు పెరగదు.. కిడ్నీలో రాళ్లు చేరవు. తేలిగ్గా జీర్ణం అవుతుంది. అన్ని వయసుల వారూ ఎంత తీసుకున్నా పరవాలేదు. ఈ ఆహారం తినేవారిలో రక్తపోటు, మధుమేహం (సుగర్) వచ్చే అవకాశాలు తక్కువ.

ఎవరి పింఛనూ నిలుపుదల చేయలేదు

- మంత్రి కొండపల్లి శ్రీనివాస్



అన్నదానంలో పాల్గొన్న మంత్రి శ్రీనివాస్

గంట్యాడ, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): అందరికీ పింఛన్ డబ్బులు ఇస్తున్నామని, సెప్టెంబరు నెలకు సంబంధించి ఎవరి పింఛన్ నిలుపుదల చేయలేదని రాష్ట్ర ఎంఎస్ఎంఈ, సెర్ప్, ఎన్ఆర్ఐ వ్యవహారాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. వినాయక ఉత్సవాల్లో భాగంగా ఆదివారం మధ్యాహ్నం ఆయన గంట్యాడ గ్రామానికి వచ్చి వినాయకుడుని దర్శించుకున్నారు. అలాగే అక్కడ ఏర్పాటు చేసిన అన్నసమారాధనలో పాల్గొని, పలువురికి ప్రసాదం పంపిణీ చేశారు. అనంతరం విలేకర్లతో మాట్లాడారు. రీ అసెస్మెంట్ దరఖాస్తు చేసుకున్నా.. లేకపోయినా సెప్టెంబరు నెలకు అయితే పింఛన్ ఆపేది లేదన్నారు. రీ అసెస్మెంట్ జరిగిన తర్వాత నెలలో తదుపరి నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకుడు కొండపల్లి కొండలరావు, గంట్యాడ పీఏసీఎస్ అధ్యక్షుడు బూడి అప్పలనాయుడు పాల్గొన్నారు.

ఆనంద గజపతి కళాక్షేత్రాన్ని ఆధునికీకరించాలి

విజయనగరం దాసన్నపేట, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో కళాకారులు, కళాభిమానులకు అత్యంత ఇష్టమైన ఆనంద గజపతి కళాక్షేత్రం అంత్యంత కళాహీనంగా ఉందని, తక్షణమే ఆధునికీకరించేందుకు చర్యలు చేపట్టాలని జిల్లా పౌర వేదిక అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ కోరారు. ఈ మేరకు ఆయన ఆదివారం విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజుని కలిసి, వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురజాడ అప్పారావు ఇంటిని ఆధునికీకరించాలని, గురజాడ కళాభారతిని కళా ప్రదర్శనలకు అనువుగా చేస్తూ ప్రేక్షకులకు తగిన సౌకర్యం కల్పించాలని కోరారు. జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిని మెడికల్ కళాశాలకు తరించాలని, ఘోషాసుపత్రిలో మౌలిక సదుపాయాలు లేక గర్భిణులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. నియోజకవర్గంలో విపరీతంగా బెల్టు షాపులు పెరిగిపోయాయని, వాటిని అరికట్టాలని కోరారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో వేదిక ప్రతినిధులు రాజారావు, ఈశ్వరప్రసాద్, రామ్మోహనరావు ఉన్నారు.

బొత్స అవగాహన లేకుండా మాట్లాడుతున్నారు

- ఎంపీ కలిశెట్టి



మాట్లాడుతున్న ఎంపీ కలిశెట్టి

విజయనగరం రూరల్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ స్టీల్ ప్లాంటు విషయమై అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు ధ్వజ మెత్తారు. ఆదివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పదేళ్ల పాటు మంత్రిగా బాధ్యతలు నిర్వహించిన బొత్సకు కనీసం అవగాహన లేదా.. అంటూ ప్రశ్నించారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటుపరం కాదని స్పష్టం చేశారు. ఒక వేళ అదే ఉద్దేశం ఉంటే కేంద్ర ప్రభుత్వం ఎందుకు స్టీల్‌ప్లాంటు కోసం నిధులు కేటాయిస్తుందో.. చెప్పాలన్నారు. ఉనికి కోసం నెలకో, రెండు నెలలకో ఒకసారి ప్రెస్‌మీట్లు పెట్టి ఈ విధంగా అసత్యాలు మాట్లాడుతున్నారన్నారు. విజయనగరం పరిధిలో ఉన్న రైల్వే స్టేషన్ల అభివృద్ధి, సమస్యల పరిష్కారంపై భువనేశ్వర్‌లో డీఆర్ఎంకి కలిసి వినతిపత్రం అందించానని తెలిపారు. గోదావరి ఎక్స్‌ప్రెస్‌ని విజయనగరం వరకూ పొడిగించాలన్నారు. టీడీపీ నాయకులు ఐవీపీ రాజు, ప్రసాదుల ప్రసాద్, కొండప ల్లి భాస్కరనాయుడు, ఆకిరి ప్రసాదరావు, సంతోష్ కుమార్ పాల్గొన్నారు.

రాజాం ఏఎంసీ కమిటీ ప్రమాణ స్వీకారం



ప్రమాణ స్వీకారం చేయిస్తున్న ఎంపీ కలిశెట్టి, ఎమ్మెల్యే కోండ్రు

రాజాం, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): రాజాం ఏఎంసీ నూతన కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ పాల్గొన్నారు. ముందుగా వీరు పోలిపల్లి పైడితల్లి అమ్మవారిని దర్శించుకున్నారు. అక్కడ నుంచి మార్కెట్ యార్డు వద్ద ఏర్పాటుచేసిన సభా వేదిక వద్దకు ర్యాలీగా చేరుకున్నారు. ఏఎంసీ ఛైర్‌పర్సన్‌గా గురవాన పార్వతి, వైస్ ఛైర్‌పర్సన్‌గా ఎల్.ధనలక్ష్మి, కమిటీ సభ్యులతో ప్రమాణస్వీకారం చేయించారు. తూర్పు కాపు కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ కొల్ల అప్పల నాయుడు, బొత్స వాసుదేవరావు నాయుడు, కోండ్రు జగదీష్, కె.అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ అందజేత



బాధితులకు చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే లలితకుమారి

లక్కవరపుకోట, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో 15 మందికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.11లక్షల 45వేల 299 మంజూరయ్యాయి. ఈ చెక్కులను ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి ఆదివారం లక్కవరపుకోటలోని తన నివాసం వద్ద లబ్ధిదారులకు అందజేశారు. ఇప్పటివరకు నియోజకవర్గ ప్రజలకు సీఎంఆర్ఎఫ్ కింద రూ.2.50కోట్లు సాయం అందించామని ఆమె తెలిపారు. అందులో పొట్నూరుకు చెందిన అక్కాజోస్యుల రుష్యశృంగశర్మ రూ.2.25లక్షలు, మల్లివీడుకు చెందిన కోరుకుండ వనిత రూ.1.23 లక్షల సాయం పొందారని చెప్పారు. కేబీఏ రాంప్రసాద్, పి.రత్నాజీ, కోళ్ల శ్రీను, కొట్యాడ ఈశ్వరరావు, జి.దుర్గాఉమేష్, పి.అప్పలరాజు పాల్గొన్నారు.

జ్ఞాన సాధనకు తొలి సోపానం గురువు

విజయనగరం టౌన్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): జ్ఞాన సాధనకు తొలి సోపానం గురువు అని ప్రముఖ ఆధ్యాత్మిక గురువు, సుపథ రూపకర్త యువీఏఎన్ రాజు అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం స్థానిక పూల్‌బాగ్‌లోని సరస్వతీ విద్యామందిర్‌లో తెలుగు భాషా పరిరక్షణ సమితి, కుసుమంచి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. తెలుగు భాషా పరిరక్షణ సమితి అధ్యక్షుడు సముద్రాల గురుప్రసాద్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని కుసుమంచి సుబ్బారావు, డాక్టర్ పి.స్వప్న హైందవి జ్యోతి ప్రజ్వలన చేసి, ప్రారంభించారు. ఈసందర్భంగా ఉత్తరాంధ్రలో గల 50 మంది ఉపాధ్యాయులకు గురుప్రసాద్, సుబ్బారావులు సత్కరించారు. ఈ ఉత్సవంలో సమితి కార్యదర్శి డా.జక్కు రామకృష్ణ, ఉపాధ్యక్షురాలు పిన్నింటి కళావతి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆదిభట్ల జయంతి



హరికథా గానం చేస్తున్న దృశ్యం

విజయనగరం రూరల్/కల్చరల్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): హరికథా పితామహుడు ఆదిభట్ల నారాయణ దాసు జయంతి వేడుకలను ఆదిభట్ల ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం కానుకుర్తివారు వీధిలోని ఆయన స్వగృహంలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా హరికథా భాగవతార్‌లు, కళాకారులను సత్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రముఖ న్యాయవాది నాలుగెస్సల రాజు మాట్లాడారు. ఆదిభట్ల నారాయణదాసు కవి, సంగీతకారుడు, నర్తకుడు, భాషావేత్త, తత్వవేత్త, అనేక ప్రతిభలు కలిగిన ప్రజ్ఞాశాలని కొనియాడారు. ఈసందర్భంగా ఆదిభట్ల నారాయణ దాసు విగ్రహానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షుడు ఆనంద నారాయణదాసు, మంజూష, మృదంగ విద్వాంసుడు మండపాక రవి, బీజేపీ నాయకుడు భవిరెడ్డి శివప్రసాద్ రెడ్డి, ఫ్రెండ్స్ ఫైన్ ఆర్ట్స్ అధ్యక్షుడు దవళ సర్వేశ్వరరావు, జానపద కళాకారుల సంఘం అధ్యక్షుడు బద్రి కూర్మారావు, స్పోర్ట్స్ ప్రతినిధి పీవీ పద్మనాభంతో పాటు, కళాకారులు పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా హరికథా భాగవతార్‌లు హరికథా గానం చేశారు.

- ప్రభుత్వ సంగీత నృత్య కళాశాలలో ఉన్న ఆదిభట్ల నారాయణదాసు విగ్రహానికి సంగీత కళాశాల ప్రిన్సిపాల్ మండపాక నాగలక్ష్మితో పాటు సంగీత కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు.

బై బై గణేశా..

- సందడిగా వినాయక నిమజ్జనాలు

విజయనగరం రూరల్/బాబామెట్ట, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): వినాయకుని నిమజ్జనోత్సవాలు జిల్లాలో ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. యువతీ, యువకులు నృత్యం చేస్తూ ఉత్సాహంగా ముందుకు సాగారు.



విజయనగరంలో వినాయకుని ఊరేగింపు



సంతకవిటి: మోదుగులపేటలో..

గణనాథుడి లడ్డూ రూ.16వేలు

రేగిడి: బూరాడ సెంటర్‌లో ఏర్పాటుచేసిన గణపతి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం నిర్వహించిన లడ్డూ వేలంపాటకు సుమారు 50మంది పోటీ పడ్డారు. వీరిలో నీలాపు రాంబాబు రూ.16వేలకు లడ్డూ దక్కించుకున్నారు. అనంతరం నిమజ్జనోత్సవం నిర్వహించారు.

ప్రత్యేక పూజలు

కొత్తవలస, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): తుమ్మికాపల్లి గేట్ సమీపంలోని మెగా యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వినాయక మండపంలో ఆదివారం విద్యార్థులతో సరస్వతి, విద్యా గణపతి పూజలు నిర్వహించారు. వేద పండితుడు అంపోలు ఉమామహేశ్వరశర్మ పూజలు చేయించారు. ● సంతకవిటి: కొత్తూరు రామచంద్రపురంలో వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం కుంకుమ పూజలు నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో హాజరయ్యారు.



రేగిడి: బూరాడలో లడ్డూతో కమిటీ ప్రతినిధులు



కొత్తవలస: పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

ఆగిఉన్న లారీని ఢీకొన్న మరో లారీ

- క్లీనర్ మృతి.. డ్రైవర్‌కు తీవ్ర గాయాలు

గంట్యాడ, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): ఆగిఉన్న లారీని వెనుక నుంచి మరో లారీ ఢీకొన్న ఘటనలో క్లీనర్ మృతిచెందగా, డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన గంట్యాడ మండలంలోని రామవరం గ్రామ సమీపంలో జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. గంట్యాడ ఎస్ఐ సాయికృష్ణ అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. శనివారం అర్ధరాత్రి సమయంలో విశాఖపట్టణం నుంచి బొబ్బిలి వైపు వెళ్తున్న ఓ లారీ టైర్ పంచర్ కావడంతో రామవరం హైవేపై బ్రిడ్జి సమీపంలో రోడ్డు పక్కనే నిలిపివేశారు. దీని వెనుకన మరో లారీని నిలిపివేశారు. అయితే అదే దారిలో అతి వేగంగా వస్తున్న లారీ.. ముందు ఉన్న లారీని ఢీకొట్టింది. డ్రైవర్ నిద్రమత్తులో ఉండటంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. దీంతో రెండో లారీలో క్లీనర్‌గా పనిచేస్తున్న అనకాపల్లి జిల్లా కె.కోటపాడు మండలానికి చెందిన కోన వెంకటరమణ క్యాబిన్‌లో ఇరుక్కునిపోవడంతో అక్కడికక్కడే మృతి చెందారు. అదే లారీలో ఉన్న డ్రైవర్ తీవ్రంగా గాయపడటంతో జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు. అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ సాయికృష్ణ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడికి గాయాలు

రాజాం రూరల్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఒమ్మి గ్రామం వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తెర్లాం మండలం పెద పాలవలస గ్రామానికి చెందిన అంపావల్లి సింహాచలం(85) తీవ్ర గాయాలపాలయ్యారు. పెరుమాళి నుంచి రాజాం వైపు ద్విచక్ర వాహనంపై వస్తున్న వ్యక్తి.. సైకిల్‌పై రోడ్డు దాటుతున్న సింహాచలాన్ని ఢీకొనడంతో ప్రమాదం సంభవించింది. తీవ్రంగా గాయపడిన సింహాచలం రాజాంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ప్రస్తుతం ఈయన పరిస్థితి విషమంగా ఉంది. క్షతగాత్రుని కోడలు అంపావల్లి గాయత్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు రాజాం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వింత వ్యాధితో నాటు కోళ్లు మృతి

లక్కవరపుకోట, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): రేగ గ్రామంలో రావాడ ఈశ్వరరావుకు చెందిన నాటు కోళ్లకు వింత వ్యాధి సోకింది. మేత మేస్తుండగా, నడుస్తుండగా ఆరోగ్యంగా కనిపిస్తూనే రెక్కలు కొట్టుకుని చనిపోయినట్లు రైతు ఈశ్వరరావు తెలిపారు. గత రెండు రోజుల్లో సుమారు 50 కోళ్లకు పైగా మృతిచెందినట్టు చెప్పారు. ఈయన గత కొద్ది సంవత్సరాలుగా నాటుకోళ్లను, ఆవులను పెంచుకుంటూ జీవిస్తున్నారు. ఒక్కసారిగా 50కి పైగా కోళ్లు చనిపోవడంతో తీవ్ర నిరాశకు గురయ్యారు. దీనిపై వెటర్నరీ ఏడీ కన్నంనాయుడుకు తెలియజేయగా, చనిపోయిన కోళ్లను ల్యాబ్‌కు పంపిస్తామని, వ్యాధి నిర్ధారణ అయిన వెంటనే మందులు అందజేస్తామని చెప్పారు.

బాలుడిపై కేసు నమోదు

జామి, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదానికి కారణమైన ఓ బాలుడిపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ వీరజనార్దన్ తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి ఎస్ఐ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మూడు రోజుల కిందట బీసీ కాలనీకి చెందిన ఒక బాలుడు స్కూటీపై వెళ్తూ దొండపర్తి జంక్షన్ వద్ద నడిచివెళ్తున్న సూరెడ్డి ముత్యాలనాయుడును ఢీకొట్టాడు. ఈ ఘటనలో ఆయన గాయాలపాలయ్యారు. అందిన ఫిర్యాదు మేరకు పోలీసులు ఆ బాలుడిపై కేసు నమోదు చేశారు. మైనర్‌కు బండి ఇచ్చిన వ్యక్తి సమాచారం సేకరిస్తున్నారు.

రెండు పశువుల వాహనాల సీజ్

దత్తిరాజేరు, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): అక్రమంగా పశువులను తరలిస్తున్న రెండు వ్యాన్‌లను పట్టుకున్నట్టు స్టేషన్ బూర్జవలస ఎస్ఐ జి.రాజేష్ ఆదివారం తెలిపారు. వాహనాల తనిఖీల్లో భాగంగా పార్వతీపురం నుంచి మానాపురం సంత వైపు వెళ్తున్న రెండు వ్యాన్‌లను నిలుపుదల చేశామన్నారు. ఈ వాహనాల్లో 13 పశువులను తరలిస్తున్నట్టు గుర్తించి, పట్టుకున్నామని చెప్పారు. ఎటువంటి అనుమతి పత్రాలు లేకపోవడంతో సీజ్ చేసి, పశువులను గో సంరక్షణ శాలకు తరలించామని తెలిపారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



పూర్వ విద్యార్థులతో అతిథులు

కొత్తవలస, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): చదువుకున్న పాఠశాలను గుర్తుంచుకుని, ఆత్మీయ సమావేశం నిర్వహించడం అభినందనీయమని అనంతపురం డిప్యూటీ కలెక్టర్ శర్మ అన్నారు. ఈయన గతంలో వియ్యంపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో సైన్స్ టీచర్‌గా పనిచేశారు. ఈ పాఠశాలలో 2000-05 సంవత్సరాల కాలంలో చదువుకున్న విద్యార్థులు ఆదివారం అదే పాఠశాల వద్ద ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సుదూర ప్రాంతంలో ఉన్న తనను సంప్రదించి ఇక్కడ ఈ సమావేశానికి రప్పించడం ఎంతో ఆనందంగా ఉందని ఆయన అన్నారు. అనంతరం పూర్వ విద్యార్థులు రూ.16వేలు విలువైన ఆంప్లిఫయర్‌ను ఆయన చేతులమీదుగా హెచ్ఎం గోవిందరాజుకు అందజేశారు. రిటైర్డ్ హెచ్ఎం కిలపర్తి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ వైర్లు



వేలాడుతున్న విద్యుత్ వైర్లు

గుర్ల, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): చింతలపేట గ్రామంలోని పంట పొలాల్లో విద్యుత్ వైర్లు ప్రమాదకరంగా వేలాడుతున్నాయి. ఈ వైర్లను కర్రలతో పట్టుకుని పొలం దున్నే పరిస్థితి ఉందని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వేలాడుతున్న విద్యుత్ వైర్లను సరిచేయాలని రైతులు కోరుతున్నారు.

ఎరువుల దుకాణాల్లో విజిలెన్స్ తనిఖీలు

లక్కవరపుకోట, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): ఎరువుల దుకాణాల్లో విజిలెన్స్ అధికారులు ఆదివారం తనిఖీలు చేపట్టారు. ఎల్.కోట సీతారాంపురం జంక్షన్ వద్ద గల ఓం ఫెర్టిలైజర్స్ అండ్ జనరల్స్‌లో విజిలెన్స్ సీఐ బి.సింహాచలం ఆధ్వర్యంలో స్టాకు రిజిస్టర్లు, ఎరువుల నిల్వలు తనిఖీ చేశారు. అలాగే ఎల్.కోట ఆర్ఎస్‌కేలో ఎరువుల నిల్వలు, రికార్డులు తనిఖీలు చేశారు. వేపాడ మండలం బొద్దాంలో గల శ్రీదేవి ట్రేటర్స్‌ను తనిఖీ చేశారు. ఎంఆర్‌పీకి మించి ఎక్కడ అమ్మినా కఠిన చర్యలకు వెనుకాడబోమని సీఐ హెచ్చరించారు. ఈయన వెంట పోలీసు సిబ్బంది, ఎల్.కోట, వేపాడ ఏవోలు పాల్గొన్నారు.

మోకాళ్లపై జిందాల్ నిర్వాసితుల నిరసన



మోకాళ్లపై నిరసన చేస్తున్న జిందాల్ నిర్వాసితులు

ఎస్.కోట రూరల్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): బొడ్డవర గ్రామంలో గత 70 రోజులుగా నిరసన చేస్తున్న జిందాల్ నిర్వాసితులు ఆదివారం మోకాళ్లపై కూర్చొని, నిరసన తెలిపారు. ఈసందర్భంగా ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చల్లా జగన్ మాట్లాడుతూ నిర్వాసితులకు భరోసా ఇవ్వాల్సిన అధికారులు, ప్రజా ప్రతినిధులు వీరిని పట్టించుకోకపోవడం దారుణమన్నారు.

మాకు న్యాయం చేయండి

రాజాం, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): మునిసిపాల్టీ పరిధిలోని డోలపేటలో తమ పూర్వీకుల నుంచి ఉన్న భూములను ఖాళీ చేయాలని దేవదాయ శాఖ అధికారులు నోటీసులు జారీ చేస్తున్నారని ఆ గ్రామానికి చెందిన పలువురు ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ వద్ద మొర పెట్టకున్నారు. ఆదివారం ఆయన్ని తన క్యాంపు కార్యాలయంలో కలిసి, వినతిపత్రం అందజేశారు. భూములకు సంబంధించి పాస్ పుస్తకాలు, అడంగల్, భూమిశిస్తు, డాక్యుమెంట్లు చూపించారు. దీనిపై ఎమ్మెల్యే స్పందించి, ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డోల గ్రామస్థులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు కనీస వేతనాలు చెల్లించాలి


మాట్లాడుతున్న అనసూర్య

బెలగాం, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ వర్కర్లను, హెల్పర్లను కార్మికులుగా గుర్తించి కనీస వేతనం చెల్లించాలని ఏపీఅంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూ నియన్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎ.అనసూర్య డిమాండ్‌చేశారు. ఆదివారం పార్వతీపురంలోని గిరిజన్ భవనంలో యూనియన్ జిల్లా మహాసభలు నిర్వహించారు. అనంతరం జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు.కార్యక్రమంలో యూనియన్ నాయకులు బి.అమరవేణి, జ్యోతి లక్ష్మి, సత్య, ఉమామహేశ్వరి, అలివేలు, రామలక్ష్మి, గౌరమ్మ పాల్గొన్నారు.

పదవీ విరమణచేసిన హెచ్‌ఎంకు సన్మానం


చలపతిరావుకు సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

పాలకొండ, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బద్దుమాసంగిలో గ్రేడ్-2 హెచ్‌ఎంగా విధులు నిర్వహించి పదవీ విరమణ చేసిన ఎంవీఎస్ చలపతిరావుకు సన్మానించారు. ఆదివారం పాలకొండలోని జెట్టివారివీధిలో కుటుంబ సభ్యులు, స్నేహితులు, బద్దుమాసంగి జీటీడబ్ల్యూఏజీహెచ్ స్కూల్ ఉపాధ్యాయులు, సిబ్బంది చలపతిరావు దంపతులకు సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ చలపతిరావు ఉపాధ్యాయ వృత్తిలో అంకితభావం, ఉన్నత విలువలతో కూడిన విద్యనందించి ఎందరో విద్యార్థులను ఉత్తములుగా తీర్చిదిద్దారని తెలిపారు.

ఫిట్‌నెస్‌పై పోలీసులు దృష్టిపెట్టాలి

సీతంపేట రూరల్,ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): పోలీసులు ఫిట్‌నెస్‌పై దృష్టి పెట్టాలని ఎస్‌ఐ వై.అమ్మనరావు తెలిపారు.ఆదివారం సీతంపేటలో ఫిట్ ఇండియా నినాదంలో పోలీస్‌సిబ్బంది సైకిల్‌ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో ఏఎస్సై సంజీవరావు, గురుమూర్తి,సిబ్బంది పాల్గొన్నారు.

●భామిని, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి):ప్రతి ఒక్కరు వ్యాయామం చేయడం వల్ల ఫిట్ ఇండియా సాధించవచ్చని ఎస్‌ఐ జి.అప్పారావు తెలిపారు. బత్తిలి పోలీస్‌స్టేషన్ నుంచి సండే ఆన్ విల్స్ కార్యక్రమంలో భాగంగా ఫిట్ ఇండియా నినాదంతో పోలీస్ సిబ్బంది సైకిల్ ర్యాలీ నిర్వహించారు.

●పాలకొండ, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి):పోలీసులు ఆరోగ్యంగా ఉండాలని డీఎస్పీ ఎం.రాంబాబు కోరారు. పాలకొండలో ఫిట్ ఇండియా నినాదంతో ఎస్పీ మాధవరెడ్డి ఆదేశాలతో ఆరు నుంచి ఏడు గంటల వరకు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ ప్రయోగమూర్తి, పాల్గొన్నారు.

లక్ష్మీనారాయణపురంలో దేశమ్మతల్లి వారాలు

పార్వతీపురం రూరల్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): లక్ష్మీనారాయణపురం తదితర గ్రామాల్లో ఆదివారం దేశమ్మతల్లి వారాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా దేశమ్మతల్లివీధిని ఊరేగించారు. ఘటాలకు భక్తులు పూజలు చేపట్టారు. దేశమ్మతల్లికి భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. ఏటా అమ్మవారి తల్లి వారాలు నిర్వహించడం ఆనవాయితీ.

మాజీ సైనికులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

బొబ్బిలి/రూరల్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): మాజీ సైనికులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ఆ సంఘ నాయకులు కోరారు.ఆదివారం బొబ్బిలి పాత కోటలో గల మాజీ సైనిక సంఘం కార్యాలయంలో బొబ్బిలి మాజీ సైనిక సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షుడు మరడ రామినాయుడు ఆధ్వర్యంలో అధ్యక్షుడు రేవళ్ల కిరణ్‌కుమార్ పర్యవేక్షణలో సమావేశం నిర్వహించారు.

బిల్లులు రాక.. ఇళ్లు కట్టలేక!

(3వ పేజీ తరువాయి)

పరిధిలోని ఒక్కోగ్రామంలో 10 నుంచి 30 మంది వరకు బాధితులున్నారు. ఒక్కమక్కువ మండలంలోనే రూ.2కోట్ల వరకు బిల్లులబకాయిలున్నాయి. దీనిపై కూటమిప్రభుత్వం స్పందించి త్వరితగతిన బిల్లులు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని మండలవాసులు కోరుతున్నారు. దీనిపై హౌసింగ్ ఏఈ సింహాచలాన్ని వివరణ కోరగా.. మక్కువ మండలంలో 548 మంది లబ్ధిదారులకు రూ.కోటి 90 లక్షల వరకు బిల్లులు పెండింగులో ఉన్నాయన్నారు.ప్రభుత్వం ఆదేశాల మేరకు ఎప్పటికప్పుడు నివేదికలు తయారుచేసి ఉన్నతాధికారులకు పంపుతున్నామని తెలిపారు. నిధులు విడుదల కాగానే లబ్ధిదారులకు చెల్లిస్తామని వెల్లడించారు.

అప్పు పుట్టడం లేదు..

పీఎం ఆవాస్ యోజన కింద 2018లో నాకు ఇల్లు మంజూరైంది. అయితే రూ.లక్ష మాత్రమే బిల్లు మంజూరైంది. మిగిలిన రూ.లక్షకు బిల్లు రాకపోవడంతో ఇంటినిర్మాణం పూర్తిచేసుకోలేక పోయాను. అప్పుకూడా పుట్టడం లేదు. ప్రభుత్వం స్పందించి పెండింగు బిల్లు చెల్లించేలా చర్యలు తీసుకోవాలి.

- పొట్టంగి శంకర్రావు, దబ్బగెడ్డ

వడ్డీలు కట్టలేకపోతున్నా..

పీఎం ఆవాస్ యోజన కింద కింద ప్రభుత్వం గ్రాంటు మంజూరుచేసింది. ఇంటి పని ప్రారంభమయ్యాక కేవలం ఒక్క బిల్లు మాత్రమే వచ్చింది. మిగిలిన బిల్లుఇంతవరకు చెల్లించలేదు. శ్లాబువరకు మాత్రమే గృహనిర్మాణం పూర్తయింది. ఇందు కోసం చేసిన అప్పులకు వడ్డీ కట్టలేక అనేక ఇబ్బందులు పడుతున్నా.

- రౌతు నాగరాజు, కోన

యూరియా.. ఏదయా?

(3వ పేజీ తరువాయి)

గంటల కొద్దీ క్యూలైన్లలో బారులుదీరాల్సి వస్తోంది. కొన్నిచోట్ల పోలీసుల సమక్షంలో ఒక్కో బస్తా చొప్పున పంపిణీ చేస్తున్నారు. ● ఇక డీఏపీ 680 మెట్రిక్ టన్నుల వరకు ఇచ్చామని అధికారులు చెబుతున్నా.. అక్కడక్కడా దీని కొరత ఉంది. ఇది కాకుండా పొటాష్, ఎస్ఎస్‌పీ, కాంప్లెక్స్ ఎరువులు, క్రిమి సంహారక మందుల విషయంలో జిల్లా వ్యవసాయ అధికారులు వివరాలు తెలిపేందుకు నిరాకరిస్తున్నారు. దీంతో ఇతర ఎరువులు, క్రిమి సంహారక మందులు ఉన్నాయా? లేదో? అనే ఆందోళన రైతుల్లో ఎక్కువవుతోంది. దీనిపై కలెక్టర్ స్పందించి తగు చర్యలు తీసుకోవాలని జిల్లావాసులు డిమాండ్ చేస్తున్నారు.

జిల్లా అధికారులు ఏమన్నారంటే..

'జిల్లాకు యూరియా పూర్తిస్థాయిలో రాలేదు. దీనిపై ప్రభుత్వానికి నివేదికలు పంపించాం. త్వరలో యూరియా వస్తుంది. ఎక్కడ ఇబ్బందులు లేకుండా పంపిణీ చేస్తాం.' అని జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు. అయితే మిగిలిన ఎరువుల విషయంపై మాత్రం సమాధానం ఇవ్వకుండా దాటవేశారు.

వంతెనల వెతలు తీరేనా?

(3వ పేజీ తరువాయి)

రూ.92.75 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు వెళ్లాయి. 133 వంతెనల మరమ్మతులకు కూడా సంబంధిత అధికారులు రూ. 10.6 కోట్లతో ప్రతిపాదనలు పంపించారు. ఈ నిధులు మంజూరు అయితేనే పనులు జరిగే అవకాశం ఉంది.

కొన్ని వంతెనలు ఇలా..

● పాలకొండ నియోజకవర్గంలో సంకిలి వద్ద వంతెన శిథిలావస్థలో ఉంది. దీనికి సంబంధించి బేరింగ్స్ మార్పు చేయాల్సి ఉంది. దీని మరమ్మతులకు రూ.కోటితో ప్రతిపాదనలు వెళ్లాయి. ● నర్సిపురం నుంచి పార్వతీపురం మధ్య రెండు శ్లాబ్ కల్వర్టులు నిర్మించాల్సి ఉంది.● సాలూరు నుంచి మక్కువ మీదుగా దుగ్గేరు వెళ్లే ప్రాంతంలో వంతెనలను రీ కనస్ట్రక్షన్ చేయాల్సి ఉంది.● కొమరాడ మండలంలో కోటిపాం వంతెన పరిస్థితి దారుణంగా ఉంది. దీని వల్ల ప్రమాదం పొంచి ఉండడంతో వాహనదారులు, ప్రయాణికులు బిక్కుబిక్కుమంటూ రాకపోకలు సాగించాల్సి వస్తోంది.

ప్రతిపాదనలు పంపించాం..

జిల్లాలో 17 వంతెనలు ప్రమాదకరస్థితిలోఉన్నాయి. 133 వంతెనలకు మరమ్మతులు చేపట్టాల్సిఉంది.మరికొన్ని పునర్నిర్మాంచాల్సిఉంది.వాటికోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం.నిధులు మంజూరైతే పనులు ప్రారంభిస్తాం.

-రాధాకృష్ణ, జిల్లా ఇంజనీరింగ్ అధికారి, ఆర్‌అండ్‌బీ శాఖ, పార్వతీపురం మన్యం

షెడ్ నిర్మించారు.. సౌకర్యాలు మరిచారు


ఎటువంటి సౌకర్యాలులేని కోమటిపల్లి శ్మశానవాటిక

● ఇదీ కోమటిపల్లి శ్మశానవాటికలో పరిస్థితి

బొబ్బిలి రూరల్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోమటిపల్లిలో శ్మశానవాటికలో కనీస సౌకర్యాలు కొరవడ్డాయి. ఇక్కడ షెడ్ నిర్మించి, వసతులు కల్పించకపోవడంతో నిరుపయోగంగా మారింది.రెండు వేల మంది నివసిస్తున్న గ్రామంలో ఎవరైనా మృతిచెందితే కుమాందన్‌పేటకు వెళ్లే దారిలో చెరువు గట్టుపైన మృతదేహాలకు దహన సంస్కారాలు నిర్వహిస్తున్నారు.గతంలో టీడీపీహయాంలో ఇక్కడ వాటిక నిర్మాణానికి ఉపాధి హామీ పథకం నిధులు మంజూరుచేశారు. అయితే బిల్లులు కాకపోవడంతో కాంట్రాక్టరు షెడ్డునిర్మించి వదిలేశారు.ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం శ్మశానవాటికను అభివృద్ధిచేయడానికి పట్టించుకోలేదని గ్రామస్థులు చెబుతున్నారు.ప్రస్తుతం ఆరుబయటే అంత్యక్రియలు నిర్వహించాల్సి వస్తోందని, ఆఖరిమజిలీకి కూడా కష్టాలుఎదుర్కోవలసి వస్తోందని గ్రామస్థులు వాపోతున్నారు. కాగా శ్మశాన వాటిక అభివృద్ధికోసం ప్రతిపాదలను పంపిస్తామని ఎంపీడీవో పి.రవికుమార్ తెలిపారు.


బొబ్బిలి రూరల్: గోతులమయమైన అలజంగి-కారాడ రోడ్డు


రామభద్రపురం: ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో గొయ్యి ఏర్పడిన దృశ్యం

గోతులు పూడ్చక.. మరమ్మతులు లేక

●ప్రయాణికులు, వాహనచోదకులకు తప్పని అవస్థలు

●అధ్వానంగా మారిన రహదారులతో తరచూ ప్రమాదాలు

జిల్లాలో పలు రహదారులు నిర్వహణ గాడితప్పింది. ఏళ్ల తరబడి కనీస మరమ్మతులకు నోచుకోవడంలేదు. గోతులు పూడ్చకపోవడంతో వాహనచోదకులు, ప్రయాణికులు అవస్థలకు గురవుతున్నారు. ప్రధానంగా వర్షం కురిస్తే గోతుల్లో నీరు చేరుతుండడంతో వాహనాలు పల్టీలు కొట్టి పలువురు గాయపడుతున్నారు. రహదారులు అధ్వానంగా మారడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి.

●బొబ్బిలి రూరల్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి):మండలంలోని అలజంగి నుంచి వెలగవలసవెళ్లే రహదారి అధ్వానంగామారింది. ఈమార్గంలో వెలగవలస, రంగరాయపురం, పిరిడి గ్రామాలకు రాకపోకలు సాగిస్తుంటారు.గతప్రభుత్వం హయాంలో మార్కెట్‌యార్డు నిధులు మంజూరుచేసినా పనులు ముందుకు సాగలేదు. కాగా నిధులకు ప్రతిపాదనలు పంపించామని, మంజూరు కాగానే రోడ్డు వేయిస్తామని ఏఈ నాయుడు తెలిపారు. అలాగే నిత్యం రద్దీగా ఉండే అలజంగి నుంచి కారాడ వేళ్లే రహదారిలో గోతులు ఏర్పడడంతో వాహనచోదకులు అగచాట్లకు గురవుతున్నారు.గోతుల్లో నీరుచేరడంతో వాహనాలు పల్టీలు కొట్టి చోదకులు గాయపడుతున్నారు.

బిల్లులు చెల్లించక...

బొబ్బిలి-బలిజిపేట రహదారి నుంచి అన్నంనాయుడువలసకు వెళ్లే మార్గంలో పనులు నిలిచిపోయాయి. వైసీపీ హయాంలో ఏపీఆర్‌ఆర్‌పీ పథకంలో తారు రోడ్డు వేయడానికి రూ.కోటీ పదిలక్షలు మంజూరయ్యాయి.బిల్లులు చెల్లించకపోడంతో పనులు నిలిచిపోయాయి.ఈరోడ్డు గుండా అన్నంనాయుడువలస, జానుమల్లువలస,గాదెలవలస ప్రజలు రాకపోకలుసాగిస్తుంటారు.ప్రస్తుతం రోడ్డుపై రాళ్లు తేలడంతో అవస్థలకు గురవుతున్నామని వాహనచోదకులు వాపోతున్నారు. కాగా అర్ధాంతరంగా నిలిచిపోయిన రహదారుల గురించి ప్రభుత్వానికి నివేదించామని, ప్రభుత్వ ఆదేశాల మేరకు పనులు పూర్తి చేస్తామని ఆర్‌అండ్‌బీ ఏఈ నాయుడు తెలిపారు.

● రామభద్రపురం, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): రామభద్రపురంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలోరోడ్డు గతుకులమయంకావడంతో వాహనచోదకులు భయాందోళన చెందుతున్నారు. ఒడిశా, ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రాల వెళ్లే వాహనాలు నిత్యం ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తుంటాయి.

ప్రతి సమస్యా పరిష్కరిస్తాం: మంత్రి


ప్రజాదర్బార్‌లో అర్జీ స్వీకరిస్తున్న మంత్రి సంధ్యారాణి

సాలూరు,ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి):ప్రతిసమస్య పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. ఆదివారం సాలూరులో ప్రజాదర్బార్ నిర్వహించారు.ఈ సందర్భంగా పలువురు పలువురు అర్జీలను అందజేశారు. రైతులు సాగునీటి సమస్యలు, విద్యుత్ సరఫరా అంతరాయం, ఎరువులు, విత్తనాల లభ్యతపై తమ సమస్యలను వివరించారు.రహదారి మరమ్మతులు, తాగునీటి సమస్యలు, గ్రామాల్లో డ్రైనేజీ సమస్యలపై మరికొందరు వినతిపత్రాలు అందజేశారు.ఇళ్లసమస్యలపై పలువురు విన్నవించారు.దీంతో మంత్రి ఆయా శాఖల అధికారులతో మాట్లాడి సమస్యలు పరిష్కరించాలని కోరారు.

రైతులకు సహకరించాలి: విప్


పీఏసీఎస్ కమిటీ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న జగదీశ్వరి

జియ్యమ్మవలస, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): పీఏసీఎస్‌ల ద్వారా రైతులకు సహకరించాలని కురుపాం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి కోరారు. ఆదివారం చినమేరంగి, బీజేపురం పీఏసీఎస్‌ల నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమాలు నిర్వహించారు.చినమేరంగి పీఏసీఎస్ చైర్మన్‌గా రెడ్డి బలరామ స్వామినాయుడు, మరో ఇద్దరు కమిటీ సభ్యులు, బీజేపురం పీఏసీఎస్ అధ్యక్షుడిగా ద్వారపురెడ్డి సోములు మాస్టారుతోపాటు కమిటీసభ్యులతో ఆమె ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో ఎంపీపీ బొంగు సురేష్, అరకు పార్లమెంట్ నియోజకవర్గ టీడీపీ అధికార ప్రతినిధి డొంకాడ రామకృష్ణ, వట్టిగెడ్డ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ ఎం.సత్యంనాయుడు, టీడీపీ మండలాధ్యక్షుడు జోగి భుజంగరావు, పీఏసీఎస్ సీఈవోలు సామల పోలిరాజు, తిరుపతిరావు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

బొబ్బిలి, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్య, ఆర్థిక సమస్యల నుంచి ఉపశమనం కోసం ప్రభుత్వం సీఎంఆర్‌ఎఫ్ కింద సహాయం చేస్తోందని ఎమ్మెల్యే బేబీనాయన తెలిపారు. ఆదివారం పక్కి గ్రామానికి చెందిన చిట్టి రూపవతికి రూ. 1,00,227లు, పణుకువలసకు చెందిన అమరావపు సత్యవతికి రూ.59,150ల చొప్పున మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను బొబ్బిలి కోటలో అందజేశారు.


చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే బేబీనాయన

పిరిడిలో కుంకుమ పూజలు

బొబ్బిలి/ రూరల్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పిరిడి కొల్లివీధి అమ్మవారి ఆలయం వద్ద ఆదివారం వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శివలింగం రూపంలో అఖండ దీపం వెలిగించి ప్రత్యేకపూజలు చేశారు. ఉదయం కుంకుమ పూజలు నిర్వహించారు.అలాగే బొబ్బిలి కోరాడ వీధిలో కూడా శివ లింగం రూపంలో అఖండ దీపం వెలిగించి ప్రత్యేకపూజలు చేశారు. రంగరాయపురం ఎస్సీ కాలనీలో ఆదివారం వినాయక పంచమరాత్ర మహోత్సవాల్లో భాగంగా భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సమరసతసేవా ఫౌండేషన్ డివిజన్ ధర్మప్రచారక్ ధూపం వాసు భక్తులకు హిందూ ధర్మం గురించి వివరించారు.

● పాలకొండ, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): నగర పంచాయతీ పరిధిలోని నక్కలపేటలోని సాయిదుర్గానగర్‌లో గణేష్ ఉత్సవాల్లో భాగంగా ఆదివారంఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు.

ఆకట్టుకున్న దీపాలంకరణ

గరుగుబిల్లి, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిలకాం పంచాయతీ దత్తివలసలో దీపాలతో వినాయకునికి ప్రత్యేక అలంకరణ ఆకట్టుకుంది. వినాయక మహోత్సవాల్లో భాగంగా మట్టి వినాయకుడిని రామాయలంలో ఏర్పాటుచేశారు. ఈసందర్భంగా మహిళలు, కమిటీ సభ్యులు 1,100కు పైగా ప్రమిదల్లో స్వస్తిక్, వినాయకుడు, శివలింగం ఆకారాల్లో దీపాలంకరణ చేశారు.

గొల్లవానివలసలో లక్ష్మీ గణపతి హోమాలు

మండలంలోని గొల్లవానివలసలో ఆదివారం నవకుండీ గాయత్రి సహిత లక్ష్మీ గణపతి హోమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకుడు కె.రామ్‌మోహనరావు మాట్లాడుతూ భక్తిభావం పెంచేందుకు గ్రామాల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ రామారావు పాల్గొన్నారు.

మక్కువలో కుక్కల స్వైరవిహారం


గుంపులుగా తిరుగుతున్న కుక్కలు

మక్కువ, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): మక్కువలో కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. ప్రధానరహదారిలో చికెన్ సెంటర్లు ఎక్కువగా నిర్వహిస్తున్నారు. దీంతో వ్యర్థాలు రోడ్లపైనే వేస్తుండడంతో వాటికోసం కుక్కలు గుంపులుగా చేరుతున్నాయి. ఈ మార్గంలో రోడ్డుపైనే వెళ్లే వాహనచోదకులపై దాడిచేస్తున్నాయి. ఆరువేల జనాభా గల మక్కువలో రోజురోజుకు కుక్కల బెడద పెరుగుతోంది. ఇక్కడి పీహెచ్‌సీలో కుక్కకాటు బాధితులు చేరుతున్నారు. ఒంటరిగా పిల్లలు, వృద్ధులు బయట తిరిగేందుకు భయాందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి కుక్కల నియంత్రణకు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

శిష్టకరణ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా శ్రీధర్

పాలకొండ, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి):పాలకొండ పట్టణ శిష్టకరణ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా భానూరు శ్రీధర్‌ను ఏకగ్రీవంగా ఆదివారం ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ అందరి సహకారంతో ఓబీసీ సాధించే విధంగా కృషి చేస్తానని తెలిపారు. అనంతరం శిష్టకరణ సంఘ నాయకులు శ్రీధర్‌కు అభినందించారు.

భువనేశ్వర్‌లో సదస్సుకు విజయచంద్ర హాజరు

బెలగాం, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయ చంద్ర ఒడిశాలోని పలు ఆధ్యాత్మిక క్షేత్రాలను ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా భువనేశ్వర్‌లో జరిగిన ఎస్సీ,ఎస్టీ సంక్షేమ కమిటీ ప్రతినిధుల జాతీయ సదస్సుకు ఆయన హాజరయ్యారు.ఈ సందర్భంగా లింగరాజు స్వామి ఆలయం, పూరీ జగన్నాథాలయం, కోణార్క్ సూర్యదేవాలయం, చారిత్రక, వారసత్వ, ఆధ్యాత్మిక క్షేత్రాలను సందర్శించారు.

నేడు వినతుల స్వీకరణ

పార్వతీపురం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యల పరిష్కారవేదికలో భాగంగా అర్జీలవివరాల మీకోసం వెబ్‌సైట్‌లో నమోదు చేయవచ్చని కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్ ఒకప్రకటనలో తెలిపారు.సమర్పించిన అర్జీల స్థాయిని 1100 టోల్‌ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేసి వివరాలు తెలుసుకోవచ్చని పేర్కొన్నారు. అన్నికార్యాలయాల్లో ప్రజల సమస్యలపై సోమవారం వినతులు స్వీకరించనున్నట్లు తెలిపారు.కలెక్టరేట్‌లో ప్రతిరోజూప్రజల నుంచివినతులు స్వీకరించడానికిసెల్లార్‌లో ప్రత్యేకంగా సెల్ ఏర్పాటుచేశామని పేర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

బొబ్బిలి రూరల్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): బొబ్బిలి డివిజన్ పరిధిలో గల 132/33 కేవీ సబ్‌స్టేషన్, 33 కేవీ కలవరాయి ఫీడర్‌లో సోమవారంఉదయం తొమ్మిదినుంచి మధ్యాహ్నం రెండుగంటల వరకు నిర్వహణ పనులకోసం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ బి.రఘు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా జగన్నాథపురం, కలవరాయి ఫీడర్ పరిధిలో గల గ్రామాలకు విద్యుత్ అంతరాయం కలుగుతుందని, ఇతర ప్రాంతాలనుంచి అవకాశంఉన్నచోట విద్యుత్ సరఫరా చేయనున్నట్లు పేర్కొన్నారు.

4న ఆటో కార్మికుల సమస్యలపై ధర్నా

బొబ్బిలి, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలో మోదీ ప్రభుత్వం మోటారు వాహనాల చట్టం తెచ్చి, రాష్ట్రంలో చంద్రబాబు స్త్రీశక్తి పేరుతో తెచ్చిన ఉచిత బస్సు పథకంతో ఆటో కార్మికుల జీవితాలు మరింత దుర్భరమయ్యాయని సీఐటీయూ నాయకుడు పి.శంకరరావు తెలిపారు.ఆదివారం బొబ్బిలి ఆటోస్టాండ్‌లో ఆటో కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఆటో కార్మికుల సమస్యల పరిష్కారానికి ఈనెల నాలుగో తేదీన ధర్నా ర్యాలీ నిర్వహిస్తామని తెలిపారు. సమావేశంలో ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు బీటీఆర్, ఎల్లంనాయుడు పాల్గొన్నారు.

వైద్యుల సమస్యలు పరిష్కరించాలి

పార్వతీపురం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వైద్యుల సమస్యలను పరిష్కరించాలని, తగ్గించిన పీజీ కోటాను పెంచాలని పీహెచ్‌సీ వైద్యుల సంఘం నాయకులు వినోద్, రవీంద్రనాయక్ కోరారు. శనివారం రాత్రి కుప్పంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును కలిసి వైద్యుల సమస్యలపై వినతి పత్రం అందజేశారు.

బీపీ స్ర్కీనింగ్ క్యాంపు

గుమ్మలక్ష్మీపురం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): తాడికొండలో ఆదివారం రాఫా ఫౌండేషన్‌ఆధ్వర్యంలో సుగర్, బీపీ స్ర్కీనింగ్ క్యాంపును ఆదివారం నిర్వహించారు. ఫౌండేషన్ డైరెక్టర్ ప్రవీణ్ కంటి మహంతి 35 ఏళ్లకు పైబడిన వారికి సుగర్, బీపీ పరీక్షలు చేశారు.తోలుఖర్జ, గొరటి గ్రామాల్లో కూడా సుగర్, బీపీ స్ర్కీనింగ్ క్యాంప్‌లు నిర్వహించారు. కార్య క్రమంలో సంస్థ ప్రతినిధులు ఎం.శోభన్‌బాబు, జి.పెంటయ్య పాల్గొన్నారు.

ఎరువులు సరఫరా చేయాలి

కురుపాంరూరల్,ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): గ్రామ సచివాలయాలు, డీలర్ల ద్వారా యూరియా,డీఏపీ పంపిణీచేయాలని ట్రైబల్ రైట్స్ ఫోరం జిల్లా అధ్యక్షుడు ఇంటికుప్పల రామకృష్ణారావు ఒక ప్రకటనలో కోరారు.రైతులు రైతు భరోసా కేంద్రాలకు ఎరువుల కోసం వెళ్తే సిబ్బంది సరైన సమాధానం కూడా చెప్పడం లేదని పేర్కొన్నారు.

జీసీసీలను బలోపేతం చేయాలి

జియ్యమ్మవలస, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): జీసీసీలను బలోపేతం చేసి గిరిజనులకు చేయూతనివ్వాలని నాగూరు, రంపచోడవరం నియోజకవర్గాల మాజీ ఎమ్మెల్యేలు నిమ్మక జయరాజు, కేకేవీవీవీ సత్యనారాయణలు కోరారు. ఈమేరకు గిరిజన సంక్షేమశాఖ ప్రభుత్వ కార్యదర్శి ఎంఎం నాయక్‌ను కార్యదర్శికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గిరిజనులకు జీసీసీలో జీఎస్‌టీ మినహాయింపుఇవ్వాలని, డీఆర్ డిపోల గోదాములు శిథిలావస్థకు చేరడంతో భవన నిర్మాణాలకు నిధుల మంజూరుచేయాలని కోరారు. డీఆర్ డిపోల పరిధిలో ఉన్న ఖాళీ పోస్టులను భర్తీచేయాలని, జీసీసీ ద్వారా గిరిజన రైతులకు రుణాలిచ్చే విషయం సులభతరం చేయాలనితెలిపారు. 1996నుంచి జీసీసీలో పనిచేసి చనిపోయిన ఉద్యోగుల పిల్లలకు కారుణ్య నియామకాలు చేపట్టాలని కోరారు.

ముగ్గురికి సేవారత్న అవార్డులు

బొబ్బిలి, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి):ప్రజా సంకల్పవేదిక ఉత్తరాంధ్ర జిల్లాల విస్తృత స్థాయి సమావేశంలో బొబ్బిలికి చెందిన ముగ్గురికి రాష్ట్రస్థాయి సేవారత్న అవార్డులతో సత్కరించారు. విశాఖలో జరిగిన కార్యక్రమంలో వేదిక జిల్లాఇన్‌చార్జి గోనా మానస, సామాజికకార్యకర్త క్లైవ్ కూపర్,చిలకలపల్లి శ్రీనివాసరావుకు అవార్డులు అందజేశారు.

సాఫ్ట్‌బాల్ పోటీల్లో సత్తాచాటిన బాలికలు

బొబ్బిలి రూరల్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని పారాదికి చెందిన బాలికలు సాఫ్ట్‌బాల్ పోటీల్లో సత్తాచాటారు. 12వ అంతర్ జిల్లా బాలికల సాఫ్ట్‌బాల్ టోర్నమెంట్ గుంటూరు జిల్లా సత్తెనపల్లి లయోలా ఇంజనీరింగ్ కాలేజీలో గతనెల 30,31తేదీల్లో నిర్వహించారు. ఈ మేరకు జిల్లా బాలికల జట్టు ప్రథమస్థానంలో నిలిచింది. ఈ జట్టులో పారాది పాఠశాలకు చెందిన ఐదుగురు బాలికలు ఉన్నారని పిడి నల్ల వెంకటనాయుడు తెలిపారు.ఈ మేరకు బాలికలకు సాఫ్ట్‌బాల్ అధ్యక్షుడు, బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయన, కార్యదర్శి విజయ్, పీడి వెంకటనాయడులు అభినందించారు.

●గుమ్మలక్ష్మీపురం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి):మండలంలోని కన్నయ్యగూడ గ్రామానికి చెందిన తోయక యమున ఇప్పీ టీమ్ విభాగంలో సిల్వర్ మెడల్, తోయక భానుమతి ఫోయిల్ టీమ్ విభాగంలో బ్రాంజ్‌మెడల్ సాధించారు.ఈ మేరకు భీమవరంలో గతనెల 30న జరిగిన 11వ క్యాడిట్ అండర్-17 అంతర జిల్లాల బాలబాలికల ఫెన్సింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో సత్తాచాటారు.

వెంకటనాయుడికి ఎక్స్‌లెన్స్ అవార్డు

బొబ్బిలి రూరల్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పారాది జడ్పీ ఉన్నత పాఠశాల పీడీ నల్ల వెంకటనాయుడికి ఎక్స్‌లెన్స్ అవార్డు దక్కింది. విద్యార్థులకు జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్‌పోటీల్లో పాల్గొనేందుకు తర్ఫీదుఇచ్చారు. బంగారు పతకాలు సాధించి గుర్తింపు తెచ్చినందుకు క్రీడా దినోత్సవం పురస్కరించుకుని విజయనగరంలో జరిగిన ఓ కార్యక్రమంలో డీఈవో మాణిక్యంనాయుడు ప్రశంసాపత్రాన్ని అందజేశారు.